క్లుప్తంగా

కూటమి మోసాలను ప్రతి ఒక్కరికీ వివరిద్దాం

మాజీ మంత్రి గొల్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అప్రజాస్వామిక విధానాలు ప్రతి ఒక్కరికీ వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకువద్దామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాజోలు నియోజవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈదరాడలో ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన శనివారం పార్టీ కార్యకర్తల సమావేం జరిగింది. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం భారీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అభయమిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, తెన్నేటి కిశోర్, ఉచ్చుల మోహన్, ఉచ్చుల విష్ణు, భూపతి మహేంద్ర, కూనపరెడ్డి రాంబాబు, నయినాల రామకృష్ణ, కంచి శ్రీరామ్, వర్ధినేని రాము, నైనాల సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి చెట్లు ఎంతో అవసరం

మామిడికుదురు: మానవాళికి చెట్లు ఎంతో అవసరమని అమలాపురానికి చెందిన వైద్యుడు అయ్యగారి వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ మై భారత్ సహకారంలో మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందించారు. అనంతరం మొక్కల పెంపకంపై ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటారు. అక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో గెయిల్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ సురేష్, అసోసియేషన్ కార్యదర్శి వాండ్రాసి రాజేష్, లీల, లక్ష్మీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు పరుపుల పంపిణీ

మలికిపురం: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మలికిపురం రోటరీ క్లబ్ వారు హాస్టల్ విద్యార్థులకు పరుపులు అందించారు. మలికిపురం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గ్రాంట్ నుంచి గత సంవత్సరం అధ్యక్షుడిగా ఉన్న బత్తుల ఝాన్సీబాయ్ పదవీకాలంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు మంజూరు చేసిన పరుపులను కేశనపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి, విశ్వేశ్వరాయపురం డేస్ప్రింగ్ చిల్డ్రన్స్ హోం పిల్లలకు పంపిణీ చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అందించారు. సమావేశంలో రోటరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ బీవీ సంపత్, కోశాధికారి దొంగ రవిచంద్ర, డేస్ప్రింగ్ సంస్థ అధినేత రొటేరియన్ సందెపూడి ఆదాం, స్థానిక ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, సర్పంచ్ గుర్లింక సత్యనారాయణ, రోటరీ జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ రీజినల్ చైర్మన్ నల్లి శివకుమార్, రోటరీ సభ్యులు డాక్టర్ గొల్ల జేసురత్నం, రాపాక విజయరావు పాల్గొన్నారు.

సామూహిక గీతా పారాయణ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో శనివారం సామూహిక గీతా పారాయణ నిర్వహించారు. గీతాపరివార్ సంస్థ ఐదో వార్షికోత్సవం సందర్భంగా దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో గీతాపరివార్ సభ్యులు ర్యాలి రామగోపాల్, ర్యాలి సుబ్బలక్ష్మి, గట్టి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సామూహిక గీతా పారాయణలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న బీఎం రాజేష్

అయినవిల్లి: మండలంలోని మాగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు తరఫున ఆ బ్యాంకు సిబ్బంది శనివారం నోట్ పుస్తకాలు అందజేశారు. బ్యాంక్ మేనేజర్ కె.రాజేష్ ఈ పుస్తకాలను స్థానిక సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణ మూర్తి చేతుల మీదుగా అందజేశారు. బ్యాంకు మేనేజర్ కె.రాజేష్ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా స్థాపించి 118 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈ నోటు పుస్తకాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వేటుకూరి శివాజీ, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తతే దివ్యౌషధం



పెదపళ్లలోని పీహెచ్‌సీ ఆవరణలో అతిసార నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



పలివెల పూజారిపాలెంలో వాటర్ సంపు పరిశీలిస్తున్న డీఎంఓ వెంకటేశ్వరరావు

- అతిసారపై ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరి
- సీజనల్ వ్యాధులైన డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్‌తో ప్రమాదం
- కొనసాగుతున్న స్టాప్ డయేరియా ప్రోగ్రాం

ఆలమూరు/కొత్తపేట: వాతావరణంలో తరచూ సంభవిస్తున్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాకాలంలో కూడా వేసవిని మరిపించే విధంగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాంటి పరిస్థితులు మరింత కాలం కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులతో పాటు అతిసార (డయేరియా) వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈఅతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా లేకపోతే ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అతిసార వ్యాధి సాధారణంగా రెండు రకాలుగా వ్యాప్తి చెందుతుంది అందులో నీళ్ల విరేచనాలు (నార్మల్ డయేరియా) మొదటిది కాగా, రెండవది రక్తం బంకతో వచ్చే విరోచనాలు (డిసెంట్రీ)గా వైద్య పరిభాషలో పిలుస్తుంటారు. చిన్నారుల్లో అతిసారకు రోటా వైరస్, పెద్దలకు వచ్చే అతిసారకు ×నోరో వైరస్ కారణమవుతుంది. దీంతో పాటు వివిధ రకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియా, జీర్ణ ప్రక్రియ అస్తవ్యస్తం కావడం, ఆహారం విష పూరితంగా మారడం కూడా అతిసారకు కారణమవుతుంది. అతిసార సోకిన రోగులకు శరీరంలో నీటి శాతం, లవణాలు తగ్గిపోవడంతో పాటు విపరీతమైన నీరసం సంభవిస్తుంది. అతిసార రోగికి ఆసమయంలో శరీరానికి అవసరమయ్యే లవణాలు అందించకపోతే డీహైడ్రేషన్ ఎక్కువై పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. అతిసారంతో బాధపడుతుండే చిన్నారులకు ఓరల్ డీహైడ్రేషన్ సొల్యూషన్‌ను సత్వరమే అందించి సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తే ప్రాణప్రాయ స్థితి నుంచి బయటపడవచ్చు. అలాగే అతిసారతో పాటు డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి జ్వరాలు కూడా ఈ సీజన్‌లో వేధిస్తుంటాయి.

అతిసార వ్యాధి లక్షణాలు

- అతిసార వ్యాధి విబ్రియో కామా, కలరా అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది.
- కలుషితమైన నీరు తాగడం
- శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం
- పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, పారిశుధ్యం లోపించడం
- చిన్నారులకు సక్రమంగా తల్లిపాలు అందించలేకపోవడం

ఆహార నియమాలు

- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని మితంగా తీసుకోవాలి.
- మసాలాలు, నూనెలు ఎక్కువగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండాలి.
- కొబ్బరినీరు ఎల్క్రాల్ పొడి కలిపిన నీరు, నిమ్మరసం తాగాలి.
- అతిసార వ్యాధి తగ్గినా కొన్ని రోజులు పాటు పౌష్టికాహారం తప్పనిసరి.

డెంగీ లక్షణాలు

డెంగీ జ్వరం ఈడిస్ ఈజిప్ట్ అనే దోమ వల్ల కలిగే వ్యాధి. లక్షణాలు సాధారణంగా సంక్రమణ తర్వాత మూడు నుంచి పద్నాలుగు రోజుల తరువాత ప్రారంభమవుతాయి. ఇందులో అధిక జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మపు దద్దుర్లు ఉంటాయి. ఆరోగ్యం మెరుగుపడటానికి సాధారణంగా రెండు నుంచి ఏడు రోజులు పడుతుంది.

నివారణ చర్యలు..

మీకు జ్వరం వచ్చినా లేదా మీరు ఇటీవల డెంగీ జ్వరాలు ఉన్న ప్రాంతంలో ఉన్నట్లయితే, వెంటనే వైద్య సహాయం తీసుకోండి. 12 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు దాటిన వృద్ధులు, గర్భిణులు, మధుమేహ వ్యాధి గ్రస్తులు, దీర్ఘకాలక వ్యాధులకు చికిత్స పొందుతున్న వారు, రక్తహీనతతో బాధపడుతున్న వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అటువంటి వారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. డెంగీ జ్వరంతో బాధపడుతున్న వారు డాక్టర్ సలహా లేనిదే ఏ ఇతర రకాలైన నొప్పి నివారణ మాత్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు.

టైఫాయిడ్ లక్షణాలు

టైఫాయిడ్ జ్వరం అనేది సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే ఒక ఇన్ఫెక్షన్. ఇది చిన్న ప్రేగులను ప్రభావితం చేస్తుంది. అధిక జ్వరం, కడుపు నొప్పి, దద్దుర్లు, ఇతర లక్షణాలకు కారణమవుతుంది. దీనిని ఎంటెరిక్ ఫీవర్ అని కూడా అంటారు.. కలుషిత ఆహారం లేదా నీటిని తీసుకోవడం, సోకిన వ్యక్తితో ప్రత్యక్ష సంబంధం. సోకిన వ్యక్తి తీసుకుని కలుషితమైన ఆహారాన్ని తినడం వల్ల ఈ వ్యాధి వస్తుంది.

నివారణ..

శుభ్రమైన నీటిని మాత్రమే తాగడం, పరిశుభ్రమైన ఆహారాన్ని తినడం, తరచుగా చేతులు కడుక్కోవడం, టైఫాయిడ్ టీకా తీసుకోవడం ద్వారా వ్యాధిని నివారించుకోవచ్చు.

పరిశుభ్రతతోనే అతిసార నివారణ



చిన్నారులకు సరైన రీతిలో తల్లి పాలను అందించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే అతిసార నివారణ సాధ్యమవుతుంది. ఇంట్లో మహిళలు వంట చేసే సమయంలోను, బిడ్డ మలమూత్రాలను తీసిన ప్పుడు చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలి. అతిసార సోకిన వ్యక్తులు అధికంగా సురక్షిత తాగు నీటిని అధికంగా తీసుకోవాలి.

– కె.భాగ్యశ్రీ, వైద్యాధికారి, పెదపళ్ల

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలి

ఆలమూరు: మండలంలోని సందిపూడిలో ఇటీవల రెండు ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అందులో గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న 100 కేవీ, వేణుగోపాలస్వామి ఆలయం పక్కన ఉన్న 6.3 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడంతో ఆ భారాన్ని అంతా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు గ్రామంలోని మిగతా మినీ ట్రాన్స్‌ఫార్మర్లపై వేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో తరచూ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వేసవిని తలపించే విధంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు విపరీతమైన ఉక్కపోత సంభవిస్తున్న తరుణంలో గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు కంటి మీదు కునుకు లేకుండా జీవనం సాగిస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక మరమ్మతులు తప్ప పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత వల్లే అనేక గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతుండనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఐఐటీ విద్యార్థికి చేయూత



ఐఐటీ విద్యార్థిని సత్కరించి ప్రోత్సాహకాన్ని అందిస్తున్న ప్రభాకరరావు తదితరులు

ఆలమూరు: విద్యారంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తామని శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు అన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో మెరుగైన ర్యాంకు సాధించి ముంబై ఐఐటీ యూనివర్శిటీలో సీటు సాధించిన మండలంలోని సందిపూడికి చెందిన తోట మోహన్ నాగ వీర వెంకటరాజును మండల కాపు సంఘ నేతలు శనివారం ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి తమ వంతు ప్రోత్సాహంగా కాపు అభ్యుదయ సంఘం తరపున రూ.32 వేలు అందజేశారు. ఐఐటీ విద్య పూర్తయ్యే వరకూ అన్ని విధాలా అండగా ఉంటామని కాపు నేతలు పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడు రామానుజుల శేషగిరిరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్లా నానాజీ, ప్రధాన కార్యదర్శి ఎలుగుబంటి సాయిబాబు, సంయుక్త కార్యదర్శి శిరిగినీడి పట్టాభి, ఉప సర్పంచ్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల జాతీయీకరణ చారిత్రక మలుపు



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి

కొత్తపేట: బ్యాంకుల జాతీయీకరణ దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక చారిత్రక మలుపు అని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కామర్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన శనివారం **బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం** సందర్భంగా విద్యార్థులకు ఆర్థిక రంగంపై అవగాహన పెంపు లక్ష్యంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ ×గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగానికి ఆర్థిక మద్దతు, పేదల ఆర్థిక చేర్పు వంటి లక్ష్యాలతో 1969లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నాయకత్వంలో 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయీకరణ జరిగిందన్నారు. ఇది బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక అభివృద్ధి వైపు మలిచిన ఘట్టం అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.శ్రీనివాసులు, సీహెచ్ నాగరాణి, సీహెచ్ నాగశ్రీలక్ష్మి, పి.సాయికృష్ణ, ఎ.దీపికదేవి, వి.నాగదీపిక తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల నిరాకరణపై స్టేషన్ వద్ద ధర్నా

- మెండుపాలెం పెద్దింట్లమ్మ గుడి వివాదం
- పలువురి అరెస్ట్



సఖినేటిపల్లి పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటపతి రాజా తదితరులు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ నిర్వహణ విషయంలో రెండు వర్గాలు మధ్య నెలకొన్న వివాదంలో ఒక వర్గం అమ్మవారి పూజలకు కోరిన అనుమతులు పోలీసులు నిరాకరించడంపై పోలీసుస్టేషన్ వద్ద ఆ వర్గం వారు ధర్నా చేశారు. అటుపై సదరు డిమాండ్లకు అనుమతులు లేవంటూ నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రాజోలు తరలించారు. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారికి ఆ వర్గం తలపెట్టిన విశేష పూజల నిర్వహణ విషయంపై శనివారం ఈ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. గతంలో పెద్దింట్లమ్మ అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు ఆలయ పరిధిలోని రెండు వర్గాల మధ్య విభేదాలు ఉండడంతో ముందస్తు జాగ్రత్తలపై అప్పట్లో అధికారులు దృష్టి సారించారు. ఆ క్రమంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశాలపై ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకూ ఉత్సవాలను ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం, పోలీసు, రెవెన్యూ సహకారంతో నిర్వహించారు. అప్పటి అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ప్రస్తుత రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో అంతర్వేది ఆలయ అర్చకులు, స్థానిక ఆసాదులు, ఆయా శాఖల సిబ్బంది నెలరోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించారు. అయితే ఇటీవల గుడి నిర్వహణ ఎండోమెంట్స్ పరిధి నుంచి తప్పించి అధికారులు సింగిల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఒక వర్గానికి కేటాయించారు. దీనిపై రెండో వర్గం కూడా అధికారులను సంప్రదించింది. ఇందుకు సంబంధించి ఆర్డర్ కోసం పట్టుబట్టిన రెండో వర్గానికి పోలీసులు సర్దిచెప్పారు. అయితే ఆలయం వద్ద చండీహోమం, శాంతిహోమం, అన్నదానం నిర్వహణకు సింగిల్ ట్రస్టు తరపున సదరు వర్గం కోరిన అనుమతులను పోలీసులు నిరాకరించారు. దీంతో పోలీసులు అనుమతులు నిరాకరణపై స్టేషన్ వద్ద కేశవదాసుపాలేనికి చెందిన ఎన్నారై యెనుముల వెంకటపతి రాజాతో సహా సదరు వర్గీయులు బైఠాయించి, ధర్నా చేశారు. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఘటనా స్థలానికి కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ చేరుకున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ వెంకటపతి రాజాతో సహా పలువురిని అరెస్ట్ చేసి పోలీసు వాహనాలలో రాజోలు స్టేషన్‌కు తరలించారు. మెండుపాలెం అమ్మవారి ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాలుష్యానికి చరమగీతం పాడుదాం

అంబాజీపేట/మామిడికుదురు/ఆలమూరు/కొత్తపేట: నేటి సమాజంలో కాలుష్యానికి ప్రధాన కారణమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి స్వచ్ఛాంధ్రను సాధిద్దామని మండల ప్రత్యేక అధికారి, కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి బి.బోసుబాబు శనివారం అన్నారు. విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ప్లాస్టిక్ వద్దు–జ్యూట్ సంచుల వాడకం ముద్దు అంటూ నినాదాలు చేశారు. మామిడికుదురులో డీఎల్డీవో వేణుగోపాలరావు మాట్లాడుతూ మానవాళి మనుగడకు ముప్పుగా మారిన ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర నిర్వహించాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాలుష్యాన్ని నివారించాలంటే ప్రజల్లో అవగాహన పెరగాలని ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించినప్పుడే పల్లెల్లో స్వచ్ఛత సాధ్యమవుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదామంటూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో రమణమూర్తి



విఘ్నేశ్వరుని దర్శించుకున్న రమణమూర్తి దంపతులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని విజయవాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ జనరల్ ఎల్‌వీ రమణమూర్తి సతీసమేతంగా శనివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ సిబ్బంది మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేదపండితులు రమణమూర్తి దంపతులను వేదమంత్రాలతో సత్కరించి, స్వామి శేష వస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. స్వామివారి ఆలయ విశిష్టతను వివరించారు.


అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ



మాచవరంలో సారె తీసుకువెళుతున్న భక్తులు

అంబాజీపేట: ఆషాఢమాసం ఆఖరి వారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. చీర–సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని మాచవరం గ్రామ దేవతలైన ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల వద్ద భక్తులు కోలాహలంతో శనివారం పండగ వాతావరణాన్ని తలపించింది. సుమారు 200 రకాల పిండివంటలు, మిఠాయిలు, పండ్లు, చలిమిడి–పానకాలతో పాటు చీర పసుపు–కుంకుమ, గాజులు అమ్మవార్లకు చెల్లించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెద్దు బండిపై అమ్మవార్లకు తీసుకొస్తున్న సారెను భక్తులు తరలించారు. ముందుగా మాచవరం సెంటర్ నుంచి సన్నాయి మేళం, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా తరలివచ్చి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవార్లకు చెల్లించిన సారెను గ్రామంలోని ప్రతి ఇంటికీ పంచారు. అలాగే భక్తులకు, ప్రయాణికులకు అమ్మవారి సారె, తీర్థప్రసాదాలను అందజేశారు.

వేంకటేశ్వరుని ఆలయాలు కిటకిట



నర్సిపూడిలో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి



నల్లచెరువులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పలు గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వర స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామివారికి భక్తులు పటికబెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామికి వివిధ పూజల ద్వారా రూ.1,44,462 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 2200 మంది భక్తులు స్వీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో శనైశ్చర స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఈఓ దారపు రెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,65,150 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.29,830 రాగా మొత్తం రూ.1,94,980 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆయన తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు భక్తులకు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్సీ సోము

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సోము వీర్రాజు దంపతులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. వారి వెంట రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, తమలంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గం కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ తరపున కొత్తపేట పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుడిగా పదవీ ప్రమాణం చేసిన పాలూరి జయప్రకాష్‌నారాయణ (జేపీ)ని ఎమ్మెల్సీ సోము వీర్రాజు శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పాలూరి కుటుంబం పార్టీకి అంకితమై పనిచేస్తుందని, వారిని పార్టీ గుర్తించి భవిష్యత్‌లో ఉన్నత పదవులు ఇచ్చి గౌరవిస్తుందన్నారు.

27న జాతీయ స్థాయి కవి సమ్మేళనం

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న విశాఖపట్నంలో 150వ జాతీయ స్థాయి శతాధిక కవిసమ్మేళనం ఏర్పాటు చేసినట్టు వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శనివారం సఖినేటిపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాహితీ పట్టాభిషేకం పేరిట నిర్వహిస్తున్న ఈ కవిసమ్మేళనంలో 150 మంది కవులకు సాహితీ పట్టాభిషేకం చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ, ఒడిశా, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన కవులు భాగస్వామ్యం అవుతారన్నారు.